జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ సిక్తాపట్నాయక్

మహిళా సాధికారత సాధించాలి

- నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట టౌన్, మార్చి 7 : మహిళా సాధికారత సాధించేందుకు మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. శుక్రవారం సింగారం చౌరస్తా వద్ద ఉన్న వృత్తి నైపుణ్య శిక్షణా కేంద్రంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి మహిళకు వ్యక్తిగత, కుటుంబ జీవితం ఉంటుందని, ఉద్యోగపరంగా చాలా మంది మహిళలు బాధ్యతలను నిర్వహిస్తున్నారని తెలిపారు. మహిళ లంతా చైతన్యం పొంది ఏదైనా అవసరం కలిగిన మహిళకు సాయం అందించాలన్నారు. జిల్లా అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మాట్లాడుతూ జిల్లాలోని మహిళా అధికారులు అంకితభావంతో పని చేస్తున్నారని కొనియాడారు. దేశంలో మహిళలకు ఎంతో గౌరవం ఉందని, సాంప్రదాయ మహిళా ఎలా ఉండాలో ప్రపంచ దేశాలకు చూపించే స్థాయి మన దేశంలోని మహిళలకు ఉందన్నారు. కుటుంబాలు నిలదొక్కుకుంటున్నాయంటే అది మహిళల వల్లనే సాధ్యమవుతున్నదన్నారు. అనంతరం మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వివిధ ఆటల పోటీల్లో గెలుపొందిన విజేతలకు కలెక్టర్, ఎమ్మెల్యే జ్ఞాపికలు పంపిణీ చేశారు. జిల్లా మహిళా అధికారులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డీడబ్ల్యూవో జయ, జెడ్పీ డిప్యూటీ సీఈవో జ్యోతి, ఆర్టీవో మేఘాగాంధీ, డీఎంహెచ్‌వో సౌభాగ్యలక్ష్మి, ఏవో జయసుధ, వివిధ మండలాల సీడీపీవోలు, సూపర్‌వైజర్లు, వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చర్యలు

వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం నైపుణ్య శిక్షణ అభివృద్ధి కేంద్రంలో జిల్లాలోని అన్ని మండలాల ఎంపీడీవోలు, ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులతో యూడీఐడీ, ఇందిరమ్మ ఇండ్లు, ఎల్‌ఆర్ఎస్, డీఎస్ఆర్, వీసీ పీసీ, సమ్మర్ యాక్షన్ ప్లాన్ తదితర అంశాలపై సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, డీఆర్డీవో మొగులప్ప, డీపీవో కృష్ణ, డీడబ్ల్యూవో జయ తదితరులు పాల్గొన్నారు.

నూతన వ్యవసాయ మార్కెట్ విధాన బిల్లును రద్దు చేయాలి

నారాయణపేట టౌన్, మార్చి 7 : కేంద్రం అమలు చేయనున్న నూతన వ్యవసాయ మార్కెట్ విధాన బిల్లును రద్దు చేయాలని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సలీం, సీపీఎం జిల్లా అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, అఖిల భారత ఐక్య రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి యాదగిరి డిమాండ్ చేశారు. కేంద్రం అవలంభిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్‌కేఎం) పిలుపు మేరకు పట్టణంలోని మున్సిపల్ పార్క్ వద్ద శుక్రవారం రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు.

కార్యక్రమం లో సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాల్‌రాం, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్, అఖిల భారత ఐక్య రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నారెడ్డి, తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి అంజిలయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంట్లో నుంచే వివక్ష వీడాలి

- కలెక్టర్ విజయేందిరబోయి

ఉత్తమ సేవలందించిన అధికారులను సన్మానిస్తున్న కలెక్టర్ విజయేందిరబోయి

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, మార్చి 7 : ఇంట్లో వివక్ష లేకుండా పెరిగితే ఆడపిల్లల జీవితంలో సాధికారత నిర్ణయాధికారం వస్తుందని కలెక్టర్ విజయేందిరబోయి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆడపిల్లలపై వివక్షత విడనాడి మగపిల్లలతో సమానంగా చూడాలన్నారు. మహిళలకు హక్కులు, సమాన అవకాశాలు కల్పనతోనే మహిళా సాధికారత, సమాజ అభివృద్ధి జరుగుతుందన్నారు. ఈ ఏడాది 'మహిళల హక్కులు, సమానత్వం, సాధికారత సాధించేందుకు వేగవంతంగా చర్యలు' అనే అంశంతో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్‌రావు మాట్లాడుతూ మహిళల హక్కులు రాజ్యాంగంలో పొందుపరిచాయన్నారు. అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే దేశంలో మహిళలపై వివక్ష, గృహ హింస, చిన్న చూపు కొనసాగుతున్నదన్నారు. ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి, ఉత్తమ సేవలు అందించిన అధికారులకు మెమోంటోలు అందజేశారు. జడ్చర్ల, మిడ్జిల్ మెడికల్ ఆఫీసర్లు సీపీఆర్ ద్వారా కార్డియాక్ అరెస్టు నుంచి ప్రాణాలు ఎలా కాపాడాలనే అంశాలపై డెమో ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో వివిధ శాఖల జిల్లా అధికారులు జరీనా, ఇందిరా, రమాదేవి, మంజుల పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షా కేంద్రాల తనిఖీ..

జడ్చర్ల టౌన్, మార్చి 7 : జడ్చర్లలోని ప్రభుత్వ కోఎడ్యుకేషన్, బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఉదయ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను కలెక్టర్ విజయేందిర బోయి తనిఖీ చేశారు.

అన్నిరంగాల్లో రాణించాలి

మహబూబ్‌నగర్, మార్చి 7 : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి జిల్లా జజ్జి పాపిరెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కోర్టు ప్రాంగణంలో మహిళా దినోత్సవం సందర్భంగా కేక్‌కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. జ్యుడిషీయల్ మహిళా సిబ్బంది తమ ఇండ్ల నుంచి తీసుకొచ్చిన వంటకాలను రుచి చూసి బహుమతులను అందజేశారు.

విద్యార్థుల తల్లులకు ఆటల పోటీలు

మరికల్, మార్చి 7 : మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం మండలంలోని పస్పుల ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల తల్లులకు ఆటల పోటీలను హెచ్‌ఎం శ్రావణి నిర్వహించారు.

జడ్చర్లలో..

జడ్చర్ల, మార్చి 7: మండలంలోని వివిధ పాఠశాలల్లో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. కోడ్గల్ ఉన్నత పాఠశాలలో స్టేట్ టీచర్స్ యూనియన్, ఎస్‌టీయూ ఆధ్వర్యంలో మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. గంగాపూర్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాళ్లను సన్మానించారు.

పారిశుధ్య కార్మికులకు చీరలు పంపిణీ

నారాయణపేట టౌన్, మార్చి 7 : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం పట్టణంలోని గీత మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో వైద్యులు గీత, విశ్వనాథ్ మున్సిపల్ పారిశుధ్య మహిళా కార్మికులకు చీరలు, టిఫిన్ బాక్స్‌లు, అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు.

మిడ్జిల్‌లో..

మిడ్జిల్, మార్చి 7 : మహిళలను గౌరవించాలని మండల విద్యాశాఖ అధికారి సుధాకర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

మహ్మదాబాద్‌లో..

మహ్మదాబాద్, మార్చి 7 : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు.

దామరగిద్దలో..

దామరగిద్ద, మార్చి 7 : మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఎస్‌బీఐ మేనేజర్ జైపాల్ అన్నారు. శుక్రవారం మహిళా దినోత్సవాన్ని బ్యాంక్ ఆవరణలో నిర్వహించారు.

మహిళా ఉపాధ్యాయులకు సన్మానం..

ఊట్కూర్, మార్చి 7 : మండలంలోని మొగ్దుంపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం మహిళా దినోత్సవం సందర్భంగా హెచ్‌ఎం శివరాజ్ ఆధ్వర్యంలో మహిళా ఉపాధ్యాయులు, సిబ్బందిని సన్మానించారు.

మాగనూరులో..

మాగనూరు, మార్చి 7 : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళా ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్‌ను సన్మానించారు.

ఉపాధ్యాయునులకు సన్మానం..

నారాయణపేట రూరల్, మార్చి 7 : మండలంలోని జాజాపూర్ ఉన్నత పాఠశాలలో మహిళా దినోత్సవం సందర్భంగా జీహెచ్‌ఎం భారతి, ఉపాధ్యాయునులు, వంట కార్మికులను సన్మానించారు. అలాగే ప్రభుత్వ కళాశాలలో పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో హెచ్‌ఎంలు, కేజీబీవీ ఎస్‌వోలను డీఈవో గోవిందరాజులు సన్మానించారు.

టీజీవో ఆధ్వర్యంలో..

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ, మార్చి 7 : టీజీవో అసోసియేషన్ మహబూబ్‌నగర్ జిల్లా విభాగం చైర్మన్ సంధ్య ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కలెక్టర్ విజయేందిరబోయి, సీనియర్ సివిల్ జడ్జీ జిల్లా లీగల్ సెల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ ఇందిర, టీజీవో సెంట్రల్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాచర్ల రామకృష్ణాగౌడ్ హాజరయ్యారు.

జిల్లా కోర్టు ప్రాంగణంలో కేక్ కట్‌చేస్తున్న జడ్జి పాపిరెడ్డి, మహిళా జడ్జీలు

నారాయణపేట రూరల్ : మహిళా ఉపాధ్యాయులను సన్మానిస్తున్న డీఈవో గోవిందరాజులు

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

నారాయణపేట, మార్చి 7 : విద్యార్థులు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమణ అన్నారు. శుక్రవారం పట్టణంలోని మినీ స్టేడియంలో పారా అథ్లెటిక్ లింగప్ప ఆధ్వర్యంలో క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్స్ పంపిణీ చేశారు. చదువుతోపాటు క్రీడలు కూడా విద్యార్థులకు ఎంతో ముఖ్యమన్నారు. కార్యక్రమంలో ఖేలో ఇండియా అథ్లెటిక్స్ కోచ్ హరికాదేవి, పీఈటీ అక్తర్‌పాషా, క్రీడాకారులు పాల్గొన్నారు.

ప్రతిభను వెలికితీసేందుకు 'యువ ఉత్సవ్'

- పీయూ వైస్ చాన్స్‌లర్ శ్రీనివాస్

యువ ఉత్సవ్-25 పోస్టర్లు ఆవిష్కరిస్తున్న పీయూ వీసీ

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, మార్చి 7 : జిల్లా స్థాయి యువ ఉత్సవ్-25లో యువత పాల్గొని తమ ప్రతిభను నిరూపించుకోవాలని పాలమూరు యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ జీఎన్ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శుక్రవారం వీసీ ఛాంబర్‌లో జిల్లా యువ ఉత్సవ్‌కి సంబంధించిన పోస్టర్‌ను జిల్లా యువజన అధికారి కోటానాయక్, సంబంధిత అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ వివిధ రంగాల్లో యువతను ప్రోత్సహించడంతో పాటు, వారిలో ఉన్న ప్రతిభను వెలికితీయడం లక్ష్యంగా పీయూ లైబ్రరీ ఆడిటోరియంలో ఈనెల 18న యువ ఉత్సవ్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాటలు పాడటం, ఫొటోగ్రఫీ, వ్యాసరచన, ఆర్ట్, సైన్స్ మేళా విభాగాలతోపాటు కల్చరల్, నాటకాలలో పోటీలు ఉంటాయన్నారు. 15-29 సంవత్సరాల లోపు యువత భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. జిల్లా యువజన అధికారి కోటానాయక్ మాట్లాడుతూ జిల్లా స్థాయి పోటీల్లో గెలుపొందిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతామన్నారు. మరిన్ని వివరాలకు 8008026308 నెంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

16న ఏకలవ్య గురుకుల ప్రవేశ పరీక్ష

బాలానగర్, మార్చి 7 : స్థానిక ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఆరో తరగతిలో చేరేందుకు ఈనెల 16న ప్రవేశ పరీక్షను నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సుభాష్ చంద్ర శుక్లా శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. పరీక్షకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈనెల 7వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో https: // tsemrs. telangana.gov.in వెబ్‌సైట్‌లో హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు.

నేడు జాతీయ లోక్‌అదాలత్

మహబూబ్‌నగర్, మార్చి 7: జిల్లా కోర్టు ప్రాంగణంలో శనివారం నిర్వహించనున్న లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జజ్జి పాపిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఎల్‌వోసీ అందజేసిన ఎమ్మెల్యే

ఎల్‌వోసీ అందజేస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

మూసాపేట, మార్చి 7 : మండలంలోని జానంపేటకు చెందిన జోగు భద్రమ్మ అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. వైద్య ఖర్చుల కోసం ఎమ్మెల్యే సీఎం సహాయనిధికి రెఫర్ చే శారు. రూ.2ల క్షల ఎల్‌వోసీ మంజూరు కావడంతో శుక్రవారం ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి బాధిత కుటుంబానికి ఎల్‌వోసీ అందజేశారు. అదేవిధంగా మదనాపూర్ మండలంలోని దుబ్బపల్లికి చెందిన సుతారి కృష్ణ గుండె సంబంధిత వ్యాధికి గురై చికిత్స పొందుతున్నాడు. అందుకు అతనికి రూ.2.75 లక్షల ఎల్‌వోసీ మంజూరైంది.

యూరియా కొరతలేదు

వివరాలను తెలుకుంటున్న డీఏవో వెంకటేశ్వర్లు

భూత్పూర్, మార్చి 7 : మహబూబ్‌నగర్ జిల్లాలో ఎక్కడ కూడా యూరియా కొరత లేదని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలోని సింగిల్‌విండో కార్యాలయంలో యూరియా సరఫరా గురించి ఆడిగి తెలుసుకున్నారు. రైతులకు అవసమైనంత మేర యూరియాను సరఫరా అవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏ యశ్వంత్‌రావు, ఏవో మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు నిర్వహించాలి

మహబూబ్‌నగర్ అర్బన్, మార్చి 7 : జిల్లా మత్స్య సహకార సంఘం ఎన్నికలు నిర్వహించాలని సంఘం నాయకులు శుక్రవారం కలెక్టర్ విజయేందిర బోయిని కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు పదవీకాలం ముగిసి 18నెలలు పూర్తయిందని,

తాత్కాలికంగా 3నెలల కోసం గంజి ఆంజనేయులును ఇన్‌చార్జిగా నియమించగా ఆయన పదవీ కాలం కూడా ముగిసిందన్నారు. ఆంజనేయులు పదవీకాలం ముగిసిన ప్పటికీ ఇంకా తానే అధ్యక్షుడిగా కొనసాగుతున్నట్లు ప్రచారం చేసుకుంటూ మత్స్యకార కుటుంబాలను తప్పుదోవ పట్టిస్తున్నాడని, ఆయనపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి జైలు శిక్ష, జరిమానా

దామరగిద్ద, మార్చి 7 : మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి కోస్గి కోర్టు న్యాయమూర్తి ఫర్వీన్‌బేగం రెండు రోజులు జైలు శిక్ష, రూ.2,500ల జరిమానా విధించినట్లు ఎస్సై రాజు తెలిపారు. మండలంలోని కానుకుర్తికి చెందిన మ్యాదరి రాజు 2024 నవంబర్ 21న పోలీసులుడ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడగా, ఈ నెల 7వ తేదీన కోస్గి కోర్టులో హాజరుపర్చామన్నారు. రెండు రోజులు జైలుశిక్ష, రూ.2,500 జరిమానా విధించడంతో రిమాండ్‌కు తరలించామన్నారు.

సీఎం రేవంత్ నెంబర్‌వన్ చీటర్

మాట్లాడుతున్న నాగురావు నామాజీ

మరికల్, మార్చి 7 : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన 420 హామీల అమలులో పూర్తిగా విఫలమైందని, సీఎం రేవంత్ నెంబర్‌వన్ చీటర్ అని బీజేపీ క్రమశిక్షణా సంఘం రాష్ట్ర కన్వీనర్ నాగురావు నామాజీ ఆరోపించారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అభివృద్ధికి బీజేపీ అడ్డుపడుతున్నదని రేవంత్‌రెడ్డి నిరాధార ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. కేంద్రం నిధులు ఇవ్వక పోతే రాష్ట్రం ఎలా అభివృద్ధి చెందుతుందని ప్రశ్నించారు. కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌ను విమర్శించే స్థాయి రేవంత్‌కు లేదన్నారు. రేవంత్ ఎక్కడ ప్రచారం చేస్తే అక్కడ బీజేపీ గెలుస్తుందని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో మేధావి వర్గమంతా బీజేపీకి అండగా నిలిచారన్నారు.

జాతీయ రహదారి పనులు వేగవంతం చేయాలి

జడ్చర్ల, మార్చి 7 : జడ్చర్ల మీదుగా వెళ్తున్న 167వ జాతీయ రహదారి విస్తరణ పనులను వేగవంతం చేయాలని జడ్చర్ల తాసీల్దార్ నర్సింగ్‌రావుకు ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో శుక్రవారం వినతిపత్రం అందజేశారు. తాసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. జడ్చర్ల నుంచి వెళ్లే 167వ రహదారిని జడ్చర్లలోని ఎల్‌ఐసీ కార్యాలయం నుంచి ప్రభుత్వ డిగ్రీ కళాశాల చివర వరకు ఉన్న రోడ్డును దాదాపు రెండేండ్లుగా నత్తనడక పనులు చేపట్టడం వల్ల వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కాంట్రాక్టర్ పది రోజుల్లో పనులను పూర్తి చేయకపోతే ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో చేపడుతామని హెచ్చరించారు.

కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు సత్త య్య, శ్రీను, కృష్ణయాదవ్, మురళి, జహంగీర్‌పాషా, నిరంజన్, నర్సింహులు, గోపాల్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

కనీస వేతనం ఇవ్వాలి

మహబూబ్‌నగర్ అర్బన్, మార్చి 7 : ఎం ప్లాయ్‌మెంట్ డ్రాఫ్ట్‌లో పనిచేసేవారికి కనీస వేతనం రూ.26వేలు ప్రకటించే లా తక్షణమే జీవోను సవరించాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని లేబర్ కమిషన్ సూపరింటెండెంట్ రఘువీర్‌కు ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వెంకటయ్య, కేశవులు, హన్మంతు, వెంకట్రాములు, నాగేశ్, కన్నయ్య, రాంచందర్ పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పుష్పలత

జడ్చర్ల, మార్చి 7 : జడ్చర్ల మున్సిపాలిటీలోని 1,18 వార్డుల్లో శుక్రవారం సీసీరోడ్డు నిర్మాణ పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ పుష్పలత ప్రారంభించారు. ఈ వార్డుల్లో 15వ ఆర్థిక సంఘం నిధులు ఒక్కో సీసీరోడ్డుకు రూ.4లక్షలతో సీసీరోడ్డు నిర్మాణ పనులను చేపట్టారు. భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ సారిక రామ్మోహన్, కౌన్సిలర్లు మహ్మద్ రహీముద్దీన్, రమేశ్, నాయకులు మీనాజోద్దీన్, ఖయ్యూం, వెంకటేశ్, మాలిక్, గోవర్ధన్, కోనేటి నర్సింహులు, వినోద్, చంద్రమౌళి పాల్గొన్నారు.

ధన్వాడలో..

ధన్వాడ, మార్చి 7 : మండలంలోని పాతపల్లిలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనుల్లో భాగంగా రూ.22లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం పనులను శుక్రవారం ఎంపీడీవో సాయిప్రకాశ్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి మాధవరెడ్డి, ఏపీఎం సిద్ధేశ్వర్, ఎంపీవో వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి

- మహబూబ్‌నగర్ ఎస్పీ జానకి

వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ జానకి

మహబూబ్‌నగర్, మార్చి 7 : మహిళా పోలీసులు ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలనిని ఎస్పీ జానకి అన్నారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీఎస్ దవాఖాన సహకారంతో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మహిళా పోలీసుల కోసం ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఆరోగ్యంగా ఉంటేనే సమాజానికి మెరుగైన సేవలు అందించగలుగుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సుజాత, వసంత, శ్వేత, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డు సంక్షేమ నిధి నుంచి ఆర్థికసాయం

విధి నిర్వహణలో ఆహార్నిశలు కృషి చేస్తున్న పోలీసు కుటుంబాలకు అండగా ఉంటామని ఎస్పీ జానకి అన్నారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని జిల్లా హోంగార్డ్సు సంక్షేమనిధి నుంచి ఐదుగురు హోమ్ గార్డులకు ఆర్థికసాయం కింద చెక్కులను ఎస్పీ అందజేశారు. మృతిచెందిన హోంగార్డులు ప్రకాశ్, శేఖరయ్య, వెంకట్రామలు, నాగమణి, శోభ కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేశారు.

మహిళలకు..

మహబూబ్‌నగర్, మార్చి 7 : జిల్లా కేంద్రంలోని భరోసా కేంద్రానికి ఎస్పీ చేరుకొని బాధితులతో మాట్లాడి వారికి ఆర్థిక భరోసా కల్పించారు. కార్యక్రమంలో భరోసా ఇన్‌చార్జి ఎస్సై సుజాత, భరోసా సిబ్బంది పాల్గొన్నారు.

అమరుల త్యాగ ఫలితమే ఎస్సీ వర్గీకరణ



నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మహబూబ్‌నగర్ అర్బన్, మార్చి 7 : అమరుల త్యాగాల వల్లే ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృపాకర్ మాదిగ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో ఎస్సీ వర్గీకరణ పోరాటంలో అసువులుబాసిన అమరుల చిత్రపటాలకు నివాళులర్పించారు. అనంతరం టీఎన్జీవో భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎందరో ఉద్యమకారుల ప్రాణత్యాగాలతోపాటు లాఠీ దెబ్బలుతిని జైలుకు వెళ్లడంవల్లే 30ఏండ్ల దండోరా ఉద్యమం విజయవంతమైందని పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ ఏబీసీ ముసాయిదాను ఆమోదించడంపై కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాందాస్, పరమేశ్, రమేశ్, నాగయ్య, హన్మంతు, వినోద్ కుమార్ పాల్గొన్నారు.

రేపు బీసీ రాజకీయ చైతన్య సదస్సు

మహబూబ్‌నగర్ అర్బన్, మార్చి 7 : జిల్లా కేంద్రంలోని క్రౌన్ గార్డెన్‌లో ఈనెల 9వ తేదీన బీసీ రాజకీయ చైతన్య సదస్సు నిర్వహిస్తున్నట్లు బీసీ సమాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌సాగర్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఎస్సీ జానకిని కలిసి సదస్సుకు అనుమతి ఇవ్వాలని విన్నవించారు.

మట్టి తరలిస్తున్న టిప్పర్ పట్టివేత

మాగనూరు, మార్చి 7 : మాగనూరు శివారులో అనుమతి లేకుండా వర్కూర్‌కు చెందిన వ్యక్తి టిప్పర్ల ద్వారా మొరం తరలిస్తుండగా శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. అక్రమంగా మట్టి తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామని తాసీల్దార్ సురేశ్‌కుమార్ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నవాబ్‌పేట, మార్చి 7 : తిమ్మయ్యపల్లికి చెందిన సత్యయ్య(40) ఫిబ్రవరి 23వ తేదీన చెట్టు ఎక్కి కొమ్మలు నరుకుతుండగా అదుపుతప్పి కింద పడి తీవ్రగాయాల పాలైనట్లు తెలిపారు. చికిత్స కోసం ఉస్మానియా దవాఖానకు తరలించగా, చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు పేర్కొన్నారు. మృతుడి కుమారుడు నరేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వివరించారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

నారాయణపేట టౌన్ : బైరంకొండలో ఉపాధ్యాయులుగా వ్యవహరించిన విద్యార్థులతో ఉపాధ్యాయ బృందం

మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాలోని హన్వాడ, బైరంకొండ, పోల్కంపల్లి, నందిపేట, మరికల్, ఉదండాపూర్, నవాబ్‌పేట, పెద్దపొర్ల తదితర పాఠశాలల్లో స్వయం పరిపాలన దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయుగా మారి తోటి విద్యార్థులు పాఠాలను బోధించారు. ప్రతిభ కనబర్చిన వారికి ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు.

– నమస్తే నెట్‌వర్క్, మార్చి 7

బహిరంగ ప్రకటన
ఇందుమూలముగా సమస్త ప్రజానీకానికి తెలియ జేయునది ఏమనగా, C.Srinivasulu S/o C.Malleshwar, aged --- years, Occ: Business, R/o H.No. 3-11-15, Veerannapet, Mahabubnagar Dist., **Applicant/ Borrower** C.Nikitha D/o C.Srinivasulu , aged 27 years, Occ: Student, R/o H.No.3-11-15, Veerannapet, Mahabub